క్లుప్తంగా

చిన్నారులకు భోజనం ప్లేట్లు పంపిణీ



పెదలంక (భట్టిప్రోలు): సహృదయ సేవా సంఘం ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పెదలంక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు 15 భోజనం ప్లేట్లు, గ్లాసులు సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా బాల సభ ఏర్పాటు చేసి పిల్లలకు వీటిని అందించారు. చిన్నారులకు ప్రత్యేకంగా ఆహారం అందచేశారు. ఈ కార్యక్రమానికి గద్దె లలిత సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు ఎస్ రవీంద్రబాబు, నిర్వాహకులు పూర్ణ, అంగన్‌వాడీ సిబ్బంది ఎన్. కుమారి, ఎస్. మరియమ్మ పాల్గొన్నారు.

25న అశోక్‌బాబు నామినేషన్‌కు తరలి రండి



భట్టిప్రోలు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఈ నెల 25న నామినేషన్ వేయనున్నారని పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల కన్వీనర్ దావూరి నాగమల్లేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి దళితులను దూరం చేయాలనే కుట్ర జరుగుతుందోందని దీనికి కర్త, కర్మ, క్రియ ప్రతిపక్ష నేత చంద్రబాబే నన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఎల్లో మీడియాలో ఇష్టానుసారంగా కథనాలు వ్రాయడం దుర్మార్గమన్నారు. దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్న చూపేనన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మనమంతా జగన్‌కు అండగా నిలబడి ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

రాష్ట్ర సేవాదళ్ కమిటీ కార్యదర్శిగా రమాదేవి

బాపట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర సేవాదళ్ కమిటి సెక్రటరీగా అమర్తపూడి రమాదేవిని నియమించారు. సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనే రమాదేవికి రాష్ట్ర సేవాదళ్‌లో అవకాశం రావటంతో పలువురు అభినందనలు తెలిపారు.

టీడీపీ అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు నామినేషన్

వేమూరు : వేమూరు నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు తహశీల్దారు కార్యాలయంలో నియోజక వర్గం ఎన్నికల అధికారి వసంతరాయుడుకు సోమవారం నామినేషన్ అందజేశారు. నామినేషన్‌లో అందజేసిన అఫిడవిట్‌లో 10 క్రిమినల్ కేసులు, భార్య భర్తల స్థిర అస్తి రూ 3,41,62,650, చర అస్తి విలువ రూ 77,74,739 లక్షలు చూపించడం జరిగిందని నియోజక వర్గం ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు.


వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు

బాపట్ల : మండలంలోని వెస్ట్ బాపట్ల వలంటీర్లు ముకుమ్మడి రాజీనామాలు చేశారు. వలంటీర్లుగా ఉండటం వలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కోన రఘుపతికి ప్రచారం చేయలేకపోతున్నామని, రాజీనామాలు చేసి నేరుగా ప్రచారంలో పాల్గొంటామని వలంటీర్లు తెలిపారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పి.వి జయశేఖర్‌కు అందించారు.

అళ్లమూడిలో ఆరుగురు

అళ్లమూడి (భట్టిప్రోలు) : వలంటీర్ల సేవలను నిలిపి వేయడాన్ని నిరసిస్తూ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నారు. సోమవారం భట్టిప్రోలు మండలం అళ్లమూడి పంచాయతీ పరిధిలోని ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు డిజిటల్ అసిస్టెంట్ ఎ. సుదీర్ కుమార్‌కు రాజీనామా పత్రాలు అందచేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తమ పట్ల టీడీపీ వ్యవహరిస్తున్న తీరు అమానుషమని వారు పేర్కొన్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నగరం : రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ నామినేషన్ కార్యక్రమానికి సోమవారం మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో మండలంలోని 26 గ్రామ పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో వెళ్లారు. సుమారు 1000 ద్విచక్ర వాహనాలు, 200 ఆటోలు, 100 కార్లుతో భారీ ర్యాలీగా రేపల్లెకు వెళ్లారు.



రేపల్లె నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఈవూరి గణేష్ నామినేషన్ దాఖలు సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గణష్, మోపిదేవి, తదితరులు

27న ఎంసెట్ విద్యార్థులకు మోడల్ పరీక్ష



మాట్లాడుతున్న పి. మనోజ్ కుమార్

భట్టిప్రోలు: ఎస్ఎఫ్ఐ, గాయత్రి అకాడమీ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు భట్టిప్రోలు గాయత్రి అకాడమీ, కేవీఎస్‌కె జూనియర్ కళాశాలల్లో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. మనోజ్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రముఖ విద్యా వేత్త ఐఐటీ రామయ్య పర్యవేక్షణలో ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లో సబ్జెక్ట్ నిపుణులతో మోడల్ పేపర్ రూపొందించి రెండున్నర దశాబ్దాలుగా మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మే 16 నుంచి జరిగే ఫార్మసీ, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ మోడల్ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 25లోపు గాయత్రి అకాడమీలో, సెల్ 94909 87646, 93955 06456 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో కె. షణ్ముఖ శ్రీనివాస్, మండల అధ్యక్ష కార్యదర్శులు మొహుద్దీన్, జగదీష్ పాల్గొన్నారు.

ఐదు నామినేషన్లు దాఖలు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరించి అనంతరం మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి డాక్టర్ ఈవూరు గణేష్ మూడు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బెల్లంకొండ సుబ్బారావు ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా కొక్కిలిగడ్డ రాంబాబు ఒక నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఈ నెల 25న సాయంత్రం 3 గంటలతో నామినేషన్ స్వీకరణ కార్యక్రమం ముగుస్తుందని చెప్పారు.

అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌కు మద్దతు పలకాలి



కూచిపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో వరికూటి అశోక్‌బాబు

నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి (వేమూరు): ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మద్దతు పలకాలని నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు నియోజక వర్గంలోని అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు మిన్నగా అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ ఎన్నికలు అన్ని వర్గాల భవిష్యత్ నిర్దేశించేందుకు జరుగుతున్నాయన్నారు. ప్రతి వర్గాన్ని మోసం చేసి ఎన్నికలు వచ్చే సరికి మరోసారి భ్రమ కల్పించడానికి వస్తున్న మోసగాళ్లను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, గ్రామ సర్పంచ్ కొండముది శ్యామలా, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జడ్పీటీసీ మూల్పూరు లావణ్య, ఎంపీటీసీ తెనాలి సుమలత, గాజులవర్తి బెనహార్, మేకా హరిబాబు, జాస్తీ బాల కృష్ణ, జాస్తీ అంజయ్య, బ్రహ్మం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

80 శాతం 'స్వీప్' చేద్దాం



ఓటు హక్కు ప్రచార ర్యాలీ

తెనాలి : స్వీప్ లో భాగంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతీ యువకుల నుంచి ఓటు కలిగిన పౌరులంతా విధిగా ఓటేయాలని కోరుతూ తెనాలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ పట్టణంలో స్వీప్ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. మున్సిపల్, రెవిన్యూ తదితర ప్రభుత్వ శాఖలతో కలిసి మే 13న జరగనున్న ఎన్నికల్లో 80 శాతం పైగా పోలింగ్ నమోదయ్యేలా ప్రజల్లో వినూత్న అవగాహన కల్పిస్తున్నారు. 'ఓటు హక్కును వినియోగించుకుందాం ...ధర్మబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందాం' అంటూ రకరకాల ప్రచారాలను చేపడుతున్నారు.ప్రత్యేకంగా 'బ్యాలెట్' పేరుతో లఘుచిత్రాన్ని నిర్మించి ప్రదర్శిస్తున్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సహా పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాత్రధారులు కావటం విశేషం. ఇలా పలు ప్రచార/అవగాహన కార్యక్రమాలతో ఓటు విలువపై చైతన్యం కల్పిస్తున్నారు.



వయోజనులతో ఓటు ఆవశ్యకతపై ప్లకార్డుల ప్రదర్శన



ఎడ్లబండిపై సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అధికారుల ప్రదర్శన



రోడ్డుపై 'స్వీప్'లోగోతో మహిళల ప్రచారం



ఓటు ఆవశ్యకతపై లఘుచిత్రం 'బ్యాలెట్'

వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ



ఆనందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్ కుటుంబ సభ్యులు

చెరుకుపల్లి : రేపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలి వెళ్ళారు. సోమవారం ఉదయం 7గంటలకు డాక్టర్ ఈవూరి గణేష్ కుటుంబ సభ్యులు నాయకులతో కలసి గుళ్లపల్లి గ్రామంలోని గంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలను పూజారికి అందచేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో మండల వైసీపీ కార్యాలయం నుంచి సుమారు 1100 బైకులు, 200 ఆటోలతో ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్ళారు. బైక్ ర్యాలీని మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, జడ్పీటీసీ మరివాడ పావని, వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు నలిగిల నాని, ఎంపీటీసీ దేవరపల్లి అమరేంద్ర, నాయకులు బండారు రామారావు, తురిమెళ్ళ శ్రీధర్, మరివాడ ప్రసాద్, బడుగు చంద్రపాల్, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులను అభినందించిన ఎంపీపీ



పదవ తరగతిలో సత్తా చాటిన విద్యార్థి రాహుల్ తల్లిదండ్రులను అభినందిస్తున్న ఎంపీపీ,జెడ్పీటీసీలు

భట్టిప్రోలు : భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన కంచర్ల రాహుల్ 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించి మండల స్థాయిలో సత్తా చాటాడు. అలాగే గొరిగపూడి కీర్తన 569 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరిలు సోమవారం వారి ఇళ్లకు వెళ్లి సన్మానించారు. మండల స్థాయిలో సత్తా చాటి పెసర్లంక హైస్కూల్‌కు పేరు తీసుకు వచ్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, గుజ్జర్లమూడి రాజు, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజిలు పాల్గొన్నారు.

పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



రూప సరస్వతి



కె. ప్రేమకీర్తన



డి. మేఘన



ఎం. సౌమ్యశ్రీ గుప్తా



వీరంకి తేజశ్రీ



జ్యోతిరసాయి

కొల్లూరు : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. సోమవారం విడుదలైన పదో తరగతి వార్షిక పరీక్షా పలితాల్లో ప్రభుత్వ కొల్లూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అత్యుత్తమ మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికోన్నత పాఠశాల నుంచి 95 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 95.7 శాతంతో 91 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కె. ప్రేమ కీర్తన 588 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంతో పాటు, మండలంలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. టి అక్షిత 563, ఎస్ కే కరీష్మ 557 మార్కులతో పాఠశాల ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండలంలోని దోనేపూడి ఉన్నత పాఠశాలకు చెందిన వాగోలు హిమశ్రీ 573 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, కె. బ్యూల 540, బి. పావని 518 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉన్నత పాఠశాలకు చెందిన కె. రోహిత్ 562 మార్కులతో పాఠశాల మొదటి స్థానం పొందగా, ఎ అర్చన 495, ఎం. అమూల్య 494 మార్కులతో, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కొల్లూరు బాలురోన్నత పాఠశాలకు చెందిన కె. చరణ్ సాయి 559 మార్కులతో పాఠశాల మొదటి స్థానం పొందగా, డి. రామకృష్ణ 537, ఎం. జాన్‌తేజ 527 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పదోతరగతి పరీక్షల్లో రాణించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

75.5 శాతం ఫలితాలు

వేమూరు : వేమూరు మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 75.5 శాతం సాధించడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి వెంకటేశ్వరావు తెలిపారు. ప్రభుత్వం పదో తరగతి పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేయగా మండలంలో పదోతరగతి పరీక్షలు 292 మంది రాయగా 210 మంది పాసయ్యారని వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలో చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రూప సరస్వతి మండల స్థాయిలో 567 మార్కులు సాధించారని, పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య మండల స్థాయిలో 561 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించడం జరిగిందని తెలిపారు.

సత్తా చాటిన పెసర్లంక విద్యార్థులు

పెసర్లంక (భట్టిప్రోలు): కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపారు. భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన కంచర్ల రాహుల్ 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించి మండల స్థాయిలో సత్తా చాటాడు. భట్టిప్రోలుకు చెందిన ఎం. సౌమ్యశ్రీ గుప్తా 570, పెసర్లంక హైస్కూల్‌కు చెందిన గొరిగపూడి కీర్తన 569, తెనాలి స్టీవెన్‌పాల్ 567, జానపాటి హరిహర కుమార్ 558 మార్కులు సాధించారు. వీరిని సోమవారం ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్‌భాషా విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో సత్తా చాటి పెసర్లంక హైస్కూల్‌కు పేరు తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ సీటు సాధిస్తానన్న తన కల నెరవేరబోతుందని పేర్కొన్నాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన పెసర్లంక హైస్కూల్

భట్టిప్రోలు : పదవ తరగతి పరీక్షల్లో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన కంచర్ల రాహుల్ 574 మార్కులు సాధించి మండలంలో ప్రథముడిగా నిలిచాడు. మండలంలోని 5 జెడ్పీ, 2 ఎయిడెడ్, 4 అన్ ఎయిడెడ్ హైస్కూళ్ల నుంచి 578 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 524 మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాశాఖాధికారులు పులి లాజర్, నీలం దేవరాజ్‌లు సోమవారం తెలిపారు. అలాగే భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌కు చెందిన ఎం. సౌమ్యశ్రీ గుప్తా 570, పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గొరిగపూడి కీర్తన 569, టి స్టీవెన్‌పాల్ 567,జానపాటి హరిహర కుమార్ 558 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ స్థానాల్లో నిలిచారు. వీరిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ భాషా, చందలూరి రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, సర్పంచులు దారా రవికిరణ్మయి, వేములపల్లి శ్రీరంజని, వేములపల్లి వెంకటేశ్వర రావు, గుమ్మడి శంకరరావులు అభినందించారు. విశ్వశాంతి హైస్కూల్‌కు చెందిన డి. మేఘన 585, ఎం. హారిక 582, పి. హర్షిత 581, కె. భావన 581, ఎ. అక్షర 581, సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన జి. అక్షర లక్ష్మి 578, పెదలంక స్వాతి హైస్కూల్‌కు చెందిన వై. వర్షిత్ 584, బి. చందన 579, వి. మోహన్ యోగేష్ 577, భట్టిప్రోలు మాతా హైస్కూల్‌కు చెందిన ఎల్. శృతి 554 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్స్,హెచ్‌ఎంలు ఎంపి వెంకట్రావు, ఫణి పార్థసారధి,వి.నాగేశ్వరరావు,వి.భారతి, గోగినేని రాఘవేంద్రరరావు, వి.గోపీకృష్ణ, కె. రవితేజలు అభినందించారు.

కర్లపాలెం మండలంలో 73శాతం ఉత్తీర్ణత

కర్లపాలెం : పదవ తరగతి పరిక్షా ఫలితాలలో కర్లపాలెం మండలంలో 73శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ రెహాన్ 600ల మార్కులు 580మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించాడు. అదే పాఠశాలకు చెందిన వై. సిరి 575 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచింది. విద్యాశాఖ అధికారుల వివరాల మేరకు మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాయగా 39మంది ఉత్తీర్ణత సాధించారు. కర్లపాలెం పాఠశాల విద్యార్థులు 17మందికి 11మంది, చింతాయపాలెం పాఠశాలలో 66మందికి 51మంది, ఎంవిరాజుపాలెం పాఠశాలలో 21మందికి 15మంది, గణపవరం పాఠశాలలో 46మందికి 31మంది పెదగొల్లపాలెం పాఠశాలలో 16మందికి 10మంది, పేరలి పాఠశాలలో 54మందికి 27మంది, శ్రీభార్గవి హైస్కూల్‌లో 19మందికి 19మంది, హైవెండ్ హైస్కూల్‌లో 23మందికి 23మంది, కర్లపాలెం పబ్లిక్ స్కూల్‌లో 21మందికి 21 ఉత్తీర్ణత సాధించారు. శ్రీభార్గవి హైస్కూల్ విద్యార్థిని పి.తేజ 585 మార్కులు, కర్లపాలెం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని డి.అక్షయ 585మార్కులతో ప్రైవేటు పాఠశాలల్లో మొదటి స్థానంలో ఉత్తీర్ణులయ్యారు.



పెసర్లంక విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

86శాతం ఉత్తీర్ణత

నగరం : నగరం మండలం నుంచి పదవతరగతి పరీక్షల ఫలితాలలో 86శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కొలసాని హరిబాబు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.మండలంలోని 6 జడ్పీ పాఠశాలలు, రెండు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 222 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 190 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి జ్యోతిర సాయి 588 మార్కులు సాధించి ప్రథమ, అదే పాఠశాలకు చెందిన జి నాగమణికంఠ 571 మార్కులతో ద్వితీయ,పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం రమ్య 558 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.పెద్దవరం,పెదపల్లి గోల్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

88.3శాతం ఉత్తీర్ణత

నిజాంపట్నం: పది పరీక్షా ఫలితాలలో మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలో 88.3 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో హరిబాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. 496 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 438 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో అడవులదీవి జడ్పీహైస్కూలు విద్యార్థిని వీరంకి తేజశ్రీ 573 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు.